నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 15 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

వైభవంగా గోదారంగనాయకుల కల్యాణం

గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దండేపల్లి, జనవరి 14 : మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం గోదా రంగనాయక స్వామి కల్యాణం వైష్ణవ సంప్రదాయం ప్రకారం వైభవంగా నిర్వహించారు. యేటా ధనుర్మాసంలో నిర్వహించే వేడుకల్లో భాగంగా ఈ వేడుక నిర్వహించగా, భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు రఘుస్వామి, సంపత్ స్వామి, వేదపారాయణదారు నారాయణశర్మ, అర్చకులు పాల్గొన్నారు.

ఆపదలో పులి

వరుస ఘటనలతో మనుగడపై ఎన్నో సందేహాలు

- రెండింటి మృత్యువాతతో ఒక్కసారిగా కలకలం
- గతంలోనూ పలు ఘటనలు
- భద్రతా చర్యలు పట్టని అటవీ శాఖ
- సంచారంపై పర్యవేక్షణ కరువు

మృతి చెందిన పులి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు (ఫైల్)

కుమ్రం ఆసిఫాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): జిల్లాలో పదేళ్లుగా పులుల సంచారం పెరిగింది. తడోబా, తిప్పేశ్వరం నుంచి పులుల రాకపోకలు కొనసాగుతున్నాయి. జిల్లాలో 2015లో మొదటిసారిగా కదంబా అడవుల్లో పులిని గుర్తించారు. ఇక ఆ తర్వాత క్రమంగా పులుల సంతతి పెరుగుతూ వచ్చింది. కాగా, ఇటీవల జరుగుతున్న ఘటనలు వాటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

తాజా ఘటనలతో కలకలం

జిల్లాలోని కాగజ్‌నగర్ పరిధి దరిగాం అటవీ ప్రాంతంలో రెండు పులులు మృతి చెందాయి. ఇందులో ఒక పులి కళేబరాన్ని ఈ నెల 6న గుర్తించారు. రెండు పులుల మధ్య జరిగిన ఘర్షణలో ఆడపులి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఇక ఇంకో పులి గాయాలతో అడవుల్లో తిరుగుతున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇక ఆ తర్వాత రెండు రోజులకే మరో పులి కళేబరాన్ని అధికారులు గుర్తించారు. రెండు రోజుల వ్యవధిలోనే రెండు పులులు మృత్యువాత పడడం అటవీ శాఖ, జిల్లా ప్రజలను ఉలిక్కి పడేలా చేసింది. పీపీసీఎఫ్ గోబ్రియల్, అడిషనల్ పీపీఎఫ్ పెరిగాయల్, సీపీఎఫ్ శాంతారం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఎన్‌టీసీఎఫ్ ప్రతినిధి ఇమ్రాన్ ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. చనిపోయిన పశువుపై విషం చల్లడంతో.. ఆ మాంసాన్ని తిన్న పులి చనిపోయిందని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

అటవీశాఖ వైఫల్యమే కారణం..?

వరుసగా రెండుపులుల మృతి అటవీ శాఖ వైఫల్యాలను ఎత్తి చూపుతున్నది. ఎస్15, ఎస్9 పులుల మరణం అటవీ అధికారుల పర్యవేక్షణాలోపాన్ని చూయిస్తున్నది. రెండేళ్ల క్రితం ఎస్6 పులి నాలుగు పిల్లలకు జన్మనివ్వగా, ఇందులో ఒకటి గతంలోనే చనిపోయింది. మిగతా పిల్లలు ఎక్కడ ఉన్నాయనేది ఇప్పటివరకు తెలియదు. అయితే 8 నుంచి 10 వరకు పులులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాయని గతంలో అధికారులు ప్రకటించారు. వాటి సంతతి 30 వరకు పెరిగిందని భావిస్తున్నారు. అవి ఎక్కడ ఉన్నాయనే సమాచారాన్ని మాత్రం అధికారులు ఇప్పటివరకు ధ్రువీకరించడం లేదు. గోప్యతా కారణాలు చూపుతూ, జిల్లాలో ఎన్ని పులులు ఉన్నాయ నే విషయాన్ని కచ్చితంగా వెల్లడించడం లేదు. జిల్లా లో కాగజ్‌నగర్ కారిడార్ 9, 745 హెక్టార్ల పరిధిలో విస్తరించి ఉంది. ఇక్కడ ప్రస్తుతం పది వరకు పులు లు ఉన్నాయి. అయితే పాత పులులే ఇక్కడ జత కడుతున్నాయి. కొత్తగా వచ్చిన పులులు ఇక్కడ ఇమడలేక, సరైన ఆవాసం, కావాల్సిన జత కుదరక తిరిగి వేరే ప్రాంతాలకు వెళ్తున్నాయి. అయితే ఈ పులుల సంచారంపై అటవీ అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కాగజ్‌నగర్ కారిడార్‌లోనే..

ప్రస్తుతం కాగజ్‌నగర్ కారిడార్‌లోనే పులుల సంచా రం కనిపిస్తోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పులులు 12 మార్గాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. కొన్ని ప్రాణహిత నదిని దాటి ఇంద్రావతి, తడోబా అభయారణ్యాలకు వెళ్తున్నాయి. కానీ కవ్వాల్ అభయారణ్యం వైపు వెళ్లడం లేదని తెలుస్తున్నది. బొగ్గుగనులు, ప్రాజెక్టులు, పరిశ్రమల అడ్డంకుల కారణంగా వాటిని దాటుకొని పులులు కవ్వాల్ వైపు వెళ్లడం లేదు. ఇంద్రావతి, తడోబా నుంచి కవ్వాల్ కు వెళ్లే మార్గాల్లో 18 బొగ్గు గనులు, కాజీపేట బల్లార్ష రైల్వేలైన్, కుమ్రం భీం ప్రాజెక్టు అడ్డుగోడగా మారాయి. కాగజ్‌నగర్ కారిడార్‌లో 400 వరకు గ్రామాలు ఉన్నాయి, ఆసిఫాబాద్–ఉట్నూర్ కు రెండు వరుసల రహదారి, మంచిర్యాల–చంద్రాపూర్ రోడ్డు కూడా పులుల కవ్వాల్‌లోకి వెళ్లకుండా ఆటంకంగా మారింది.

సంబురాల సంక్రాంతి నేడే..

సంబురాల సంక్రాంతి రానే వచ్చింది. పట్టణవాసులు సొంతూళ్లకు చేరుకోగా, ప్రతి ఇల్లూ కళకళలాడుతున్నది. ముగ్గులతో ముస్తాబైన వాకిళ్లు కనువిందు చేస్తుండగా, గంగిరెద్దుల విన్యాసాలు.. పిల్లల ఆటపాటలతో ఎటు చూసినా సందడే కనిపిస్తున్నది. ఆదివారం భోగిని వైభవంగా నిర్వహించిన ప్రజానీకం, నేడు మకర సంక్రాంతి, రేపు కనుమను ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమైంది.

కొనసాగుతున్న రేషన్ ఈకేవైసీ

అనర్హులను గుర్తించేందుకు సర్కారు చర్యలు

- ఇప్పటి వరకు జిల్లాలో 4,15,698 మందికి పూర్తి
- వేలి ముద్ర వేసిన వారి పేర్లే లెక్కలోకి..

ఈకేవైసీ కోసం రేషన్ దుకాణంలో వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారులు

మంచిర్యాల అర్బన్, జనవరి 14 : రేషన్ కార్డుకు ఈకేవైసీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిన విషయం విదితమే. ఆహార భద్రత కార్డులోని సభ్యులందరూ రేషన్ దుకాణానికి వెళ్లి ఈకేవైసీ(నో యువర్ కస్టమర్) చేయించుకోవాలని సూచించింది. ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా రేషన్ బియ్యం అందజేస్తుంది. కొన్ని కార్డుల్లో ఉన్న కుటుంబ సభ్యులు చనిపోవడమో.. లేక పెండ్లి చేసుకొని వేరే ఇంటికి వెళ్లిపోవడమో జరిగినా.. వారి పేర్లు అలాగే ఉన్నాయి. అలాంటి వాటిని ఏరివేసే కార్యక్రమం మొదలు పెట్టింది. జిల్లాలో 2,19,190 కార్డులుండగా 6,39,546 యూనిట్లు ఉన్నాయి. రేషన్ కార్డుల ఆధారంగా యూనిట్లను పరిశీలించనున్నారు. ఈ పాస్ మిషన్‌లో కార్డుదారు ఆధార్ నంబర్ నమోదు చేయగానే ఆ కార్డులో ఎందరు ఉన్నారో (ఎన్ని యూనిట్లు ఉన్నాయో) చూపిస్తుంది. వారందరూ ఆధార్ కార్డులతో రేషన్ దుకాణానికి హాజరై వేలిముద్ర వేయాల్సి ఉంటుంది.

ఈకేవైసీతో బోగస్‌కు చెక్..

ఈకేవైసీ ప్రక్రియ ద్వారా అనర్హులను గుర్తించవచ్చుననే ఉద్దేశంతో పౌరసరఫరాల శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 423 రేషన్ దుకాణాలుండగా, వీటి పరిధిలో 2,19,190 (ఏఎఫ్ఎస్‌సీ 15,482, ఎఫ్ఎస్‌సీ 2,03,549, ఏఏపీ 159) కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 6,39,546 (ఏఎఫ్ఎస్‌సీ 47,761, ఎఫ్ఎస్‌సీ 5,91,625, ఏఏపీ 160) యూనిట్లు ఉన్నాయి. ఇందులో ఏఏపీ (అన్నపూర్ణ) కార్డుదారులకు ఒక్కో యూనిట్‌కు 10 కిలోల చొప్పున, ఏఎఫ్ఎస్‌సీ (అంత్యోదయ) కార్డుదారులకు ఒక్కో యూనిట్‌కు 35 కిలోలు, ఎఫ్ఎస్‌సీ కార్డు లబ్ధిదారులకు ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. కొన్నిచోట్ల మృతి చెందిన వారి పేరిట ప్రతి నెలా ఉచితంగా రేషన్ తీసుకుంటున్నారు. ఎవరైతే ఈకేవైసీకి హాజరుకారో వారి పేరు (ఆ యూనిట్)ను సర్వే పూర్తయిన అనంతరం తొలగించనున్నారు.

జిల్లాలో 65 శాతం పూర్తి....

జిల్లాలో ఇప్పటి వరకు ఆధార్ ఈకేవైసీ 65 శాతం మాత్రమే పూర్తయింది. 2,19,190 కార్డుల్లో 6,39,546 యూనిట్లు ఉండగా, ఇప్పటి వరకు 4,15,698 యూనిట్లు ఈకేవైసీ అయ్యాయి. బెల్లంపల్లి మండలంలో 58,086 యూనిట్లకు 33,894 (58.35 శాతం) యూనిట్లు ఈకేవైసీ అయ్యాయి. భీమినిలో 12,117 యూనిట్లకు 8,082(66.70 శాతం), చెన్నూర్‌లో 46,268 యూనిట్లకు 27,967 (60.45 శాతం), దండేపల్లిలో 42,910 యూనిట్లకు 28,841 (67.21 శాతం), జైపూర్‌లో 29,173 యూనిట్లకు 20,382 (69.87 శాతం), జన్నారంలో 46,821 యూనిట్లకు 32,547 (69.51 శాతం), కాసిపేటలో 26,465 యూనిట్లకు 17,959 (67.86 శాతం), కోటపల్లిలో 31,473 యూనిట్లకు 21,836(69.38 శాతం), లక్షెట్టిపేటలో 43,232 యూనిట్లకు 31,457 (72.76 శాతం), మంచిర్యాలలో 71,909 యూనిట్లకు 43,250 (60.15 శాతం), మందమర్రిలో 67,569 యూనిట్లకు 41,821 (61.89 శాతం), తాండూరులో 26,143 యూనిట్లకు 15,968 (61.08 శాతం), వేమనపల్లిలో 17,273 యూనిట్లకు 12,017 (69.57 శాతం), నస్పూర్‌లో 39,849 యూనిట్లకు 24,940 (62.59 శాతం), హాజీపూర్‌లో 28,058 యూనిట్లకు 20,305 (72.37 శాతం), భీమారంలో 13,847 యూనిట్లకు 10,068 (72.71 శాతం), కన్నెపల్లిలో 17,759 యూనిట్లకు 11,959 (67.34 శాతం), నెన్నెల మండలంలో 20,594 యూనిట్లకు 12,405(60.24 శాతం) యూనిట్లు ఈకేవైసీ చేసుకున్నారు.

ఈకేవైసీ తప్పనిసరి..

రేషన్ కార్డులో పేర్లున్న వారందరూ తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలి. సమీప రేషన్ దుకాణానికి వెళ్లి వేలి ముద్రలు వేయాలి. డీలర్లు సైతం రేషన్ పంపిణీ అనంతరం ఖాళీ ఉన్న సమయంలో ఈకేవైసీ అప్‌డేట్ చేయాలి. కొందరు పనుల నిమిత్తం ఇతర జిల్లాల్లో ఉంటున్నా సరే అక్కడే అప్‌డేట్ చేసుకోవచ్చు. రేషన్ సరఫరా యథావిధిగా కొనసాగాలంటే తప్పకుండా ఈకేవైసీ చేయించాలి. దీంతో బోగస్ యూనిట్లు, కార్డులు ఎగిరిపోయి అర్హులకు నాణ్యమైన బియ్యం అందుతాయి.

- వాజీద్ అలీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మంచిర్యాల

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి మంటలు

భోగి మంటలు వేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మంచిర్యాల అర్బన్, జనవరి 14 : జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాల మైదానంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం భోగి మంటల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వాకర్స్ క్లబ్ సభ్యులందరూ సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేశారు. మహిళలు, ముస్లింలు సైతం పాల్గొని నృత్యాలు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, అధ్యక్షుడు వీరస్వామి, ప్రధాన కార్యదర్శి సాగర్ యాదవ్, కోశాధికారి మధు, గౌరవ అధ్యక్షుడు సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ మంతెన గట్టయ్య, కార్యూరి చంద్రమౌళి, బద్రుద్దీన్, విఘ్నేష్, శ్రీనివాస్, వీర శంకర్ పాల్గొన్నారు.

ఆటోలో ఉన్న ప్యాసింజర్‌కు విజ్ఞప్తి చేస్తున్న ఆటో యునియన్ నాయకులు

ఆటోవాలాలను ఆదుకోవాలి

కాగజ్‌నగర్, జనవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం ఆటోవాలాలను ఆదుకోవాలని ఆ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఆటో ఓనర్స్, డ్రైవర్లు ఆటోల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీబస్ సౌకర్యం కల్పించడం వల్ల ఆటోలకు గిరాకీ కావడం లేదని, కిస్తీలు కట్టడం ఇబ్బంది అవుతుందని, కుటుంబాన్ని పోషించుకోలేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆటో లోకల్ చార్జి రూ.50 నుంచి రూ. 60కు పెంచినట్లు స్పష్టం చేశారు. ఆటోల బంద్ నిర్వహించడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో ఆటో ఓనర్స్, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆర్కే-5 గని పై కప్ప కూలి కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్, జనవరి 14 : మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే–5 గనిలో శనివారం రాత్రి పై కప్పు కూలి జనరల్ మజ్దూర్ కార్మికుడు జరుపుల నగేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. గనిలోని 4 సీం 21 అండాఫ్‌లో బ్లాస్టింగ్ చేసి చటాయి(తనికీ) చేస్తుండగా.. ఒక్కసారిగా పైకప్పు కూలింది. సుమారు 2 టన్నుల బరువున్న బండ నగేశ్ నడుముపై పడింది. నడుము విరిగింది. తదితర చోట్ల తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కార్మికులు స్థానిక ఏరియాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి హైదరాబాద్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించారు. నగేశ్‌ను ఏరియాస్పత్రిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, పిట్ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, నర్సింగరావు, సహాయ కార్యదర్శి లక్కిరెడ్డి, సత్తిరెడ్డి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ పరమార్శించారు.

నగేశ్‌ను పరామర్శిస్తున్న గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య